## నాణ్యమైన బోధన అందించాలి

హాజీపూర్, ఆగస్టు 23 : విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యాబోధన అందించాలని మంచిర్యాల అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ పేర్కొన్నారు. మండలంలోని ముల్కల్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలలోని రిజిస్టర్లు, రికార్డులను, వంట గదితో పాటు, నిత్యావసర సరుకులు, ఆహార సామగ్రిని పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. తరగతి గదుల్లోనికి వెళ్లి, విద్యార్థులతో మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల బోధనా తీరు వివరాలను తెలుసుకున్నారు. మధ్యాహ్నం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. విద్యార్థులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 'నెల నెలా బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డులు'

మంచిర్యాలటౌన్, ఆగస్టు 23: ఎన్‌పీడీసీఎల్ పరిధిలో ఉద్యోగుల మధ్య స్నేహపూర్వక పోటీతత్వాన్ని పెంచేందుకు వివిధ విభాగాల్లో నైపుణ్యత చూపిన వారికి నెలనెలా బెస్ట్ పర్ఫార్మెన్స్ ఆఫ్ ది మంత్ పేరిట అవార్డులు అందజేయనున్నట్లు మంచిర్యాల జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ ఎన్ శ్రావణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన అధికారులను గుర్తించి, వివిధ అంశాల ప్రాతిపదికన ఎంపికచేయనున్నట్లు తెలిపారు. వారికి అవార్డులు, ఉత్తమ ఇంప్రూవర్స్ అవార్డులను అందించాలని సంస్థ ఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ప్రకటించారని వివరించారు. ఈ అవార్డులతో ఉద్యోగుల్లో పనితీరు మరింతగా మెరుగుపడి, మెరుగైన, నాణ్యమైన సేవలు అందించేందుకు దోహదపడుతుందని తెలిపారు. అధికారులు, ఉద్యోగుల పనితీరును సప్లై మెయింటెనెన్స్, డీటీఆర్ నిర్వహణ, వైఫల్యాలను తగ్గించుకొని, విద్యుత్ అంతరాయాలను తగ్గించడం, వినియోగదారులకు సత్వర సేవలు అందించడం, కొత్త సర్వీసులను సకాలంలో అందించడం, రెవెన్యూ వసూళ్లు, తదితర అంశాల వారీగా ఉద్యోగులకు పాయింట్లను వేసి, ఉత్తమ ఉద్యోగులను గుర్తించనున్నట్లు వెల్లడించారు.

## సామాజిక తనిఖీ ప్రజావేదిక

ప్రజావేదికలో డీఆర్డీవో కిషన్, ప్రత్యేకాధికారి శ్రీనివాస్

వేమనపల్లి, ఆగస్టు 23 : వేమనపల్లి ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ అధ్యక్షతన 14వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. డీఆర్డీవో కిషన్ హాజరయ్యారు. 14 జీపీల నివేదికలు సోషల్ ఆడిట్ డీఆర్పీలు చదివి వినిపించారు. మస్టర్ల కొట్టివేతలు, కూలీల సంతకాలు సరిగా లేకపోవడం, హరితహారం రిజిస్టర్లు పూర్తిస్థాయిలో లేవని, ఎంబీ నిర్వహణ వర్క్‌ఫైల్స్ పూర్తిస్థాయిలో లేవని, పెట్టిన మొక్కలకు, బతికిన మొక్కలకు మధ్య తేడాలు ఉన్నాయని గుర్తించిన డీఆర్డీవో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యదర్శులు, ఉపాధి హామీ సాంకేతిక, క్షేత్ర సహాయకులకు జరిమానా విధించారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, గత ఎంపీడీవో లక్ష్మయ్య, విజిలెన్స్ అధికారి కిరణ్, సీఎల్ఆర్సీ సురేశ్, ఏపీవో సత్యప్రసాద్, ఈసీ మధూకర్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రస్మా మండల కమిటీలు

కెరమెరి, ఆగస్టు 23 : తెలంగాణ గుర్తింపు పాఠశాలల యాజయాన్య సంఘం మండల కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పెద్దపల్లి కిషన్‌రావ్, జిల్లా అధ్యక్షుడు పీ దేవభూషణం ఆధ్వర్యంలో మండలం లోని బ్లూమింగ్ బడ్స్ పాఠశాలలో ఎన్నికలు నిర్వహించారు. మండలాధ్యక్షుడిగా గంధం సంపత్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు, కోశాధికారిగా షేక్ కలీం ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిచారి, కోశాధికారి రాజేందర్ ప్రసాద్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డీకొండ సంజీవ్, జిల్లా గౌరవాధ్యక్షుడు జ్యోతేష్ సితానీ, జిల్లా నాయకులు అలగొట్టు తిరుపతి, తులసీదాస్ పాల్గొన్నారు.

**మందమర్రి కమిటీ..**

మందమర్రి రూరల్, ఆగస్టు 24 : ట్రస్మా అసోసియేషన్ బలోపేతానికి కలిసికట్టుగా కృషిచేయాలని ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎండీ అజీజ్ అన్నారు. మండల కమిటీని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా వీ శ్యాంకుమార్ (గ్రేస్ లిటిల్ హార్ట్ స్కూల్), ప్రధాన కార్యదర్శిగా లత శ్రీ (లత కోచింగ్ సెంటర్), కోశాధికారిగా సారంగారావు ఎన్నికయ్యారు. సభ్యులకు నియామక పత్రాలు అందజేసి, సన్మానించారు.

## వీధి దీపాలు ఏర్పాటు చేయాలి



వినతి పత్రం ఇస్తున్న గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ యాదవరావ్

జైనూర్, ఆగస్టు 23 : మండల కేంద్రంలోని సంజయ్‌నగర్ కాలనీలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతూ కాలనీవాసులు శుక్రవారం ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవ్‌రావ్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ప్రజాపాలన జరిగిందని గుర్తుచేశారు. గ్రామపంచాయతీకి ప్రత్యేక అధికారిగా నియమించిన అధికారులు ఏ రోజు కూడా విధులకు హాజరుకాకుండా నామమాత్రంగా కార్యాలయానికి వచ్చి, వెళ్లిపోతున్నారని ఆరోపించారు. ప్రజల సమస్యలు పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కుమ్ర భగవంత్‌రావ్, సంజయ్ నగర్ కాలనీవాసులు కిట్టన్న, రమేశ్, వెంకటి, భూమన్న తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం

శ్రీరాంపూర్, ఆగస్టు 23 : శ్రీరాంపూర్ కృష్ణకాలనీలోని కేరళ మోడల్ హైస్కూల్లో శుక్రవారం విద్యార్థులకు ఎస్ఐ సంతోష్ మాదక ద్రవ్యాలు, గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై డ్రాయింగ్ పోటీలు, అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు లఘు చిత్రాలు నిర్మించారు. ఎస్ఐ సంతోష్ పరిశీలించి, పలు విషయాల గురించి వివరించారు. కార్యక్రమంలో పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జన్నారం, ఆగస్టు 23 : మండలంలోని తపాలాపూర్, రాంపూర్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఎస్ఐ రాజవర్ధన్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు, గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మందమర్రి రూరల్, ఆగస్టు 24 : స్థానిక కృష్ణవేణి టాలెంట్ పాఠశాల విద్యార్థులకు మందమర్రి సీఐ కే శశిధర్ రెడ్డి డ్రగ్స్, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై డ్రాయింగ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఎస్ఐ రాజశేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంవేణు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ భద్రత కల్పించాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఆగస్టు 23 : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించి, రెన్యువల్ ఉత్తర్వులు వెంటనే విడుదల చేయాలని అతిథి అధ్యాపక సంఘం (2152) జిల్లా అధ్యక్షుడు ముడిమడుగుల మారుతి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కుమ్రం భీం చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ ధర్నా నిర్వహించారు. అనంతరం రెవెన్యూ అధికారి లోకేశ్వర్ రావ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు కృష్ణమూర్తి, రాము, యాదగిరి, భిక్షపతి, రాంబాబు, శ్రీకాంత్, స్వాతి, ఆశ్విని, మౌనిక, సునీత, ఉదయశ్రీ పాల్గొన్నారు.

# ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే
- పూలాజీ బాబా జయంతి ఉత్సవాల నిర్వహణపై సన్నాహక సమావేశం

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 23 : జిల్లాలో ఈ నెల 29, 30 తేదీల్లో పూలాజీ బాబా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం పూలాజీ బాబా జయంతి ఉత్సవాల నిర్వహణపై సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావు, పూలాజీ బాబా ట్రస్ట్ అధ్యక్షుడు ఇంగ్లె కేశవరావుతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. వేడుకల నిర్వహణకు సంబంధిత అధికారులు, ట్రస్ట్ ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఆసిఫాబాద్, వాంకిడి, రెబ్బెన, కెరమెరి, జైనూర్ మండలాల నుంచి భక్తుల సౌకర్యార్థం బస్సులు ఏర్పాటు చేయాలని, వైద్య సేవల నిమిత్తం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం జయంతి ఉత్సవాల సంబంధిత గోడ ప్రతులను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాం, సంబంధిత శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**డీఆర్సీ సెంటర్ పూర్తిచేయాలి**

కాగజ్‌నగర్, ఆగస్టు 23 : కాగజ్‌నగర్ పట్టణంలో నిర్మిస్తున్న డీఆర్సీ సెంటర్ త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అధికారులకు సూచించారు. నిర్మాణ దశలో ఉన్న డీఆర్సీ సెంటర్, మహిళా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న బల్క్ మిల్క్ సెంటర్ భవనాన్ని, ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి ఆయన పరిశీలించారు. వీధి కుక్కల నియంత్రకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వెంటనే ఏబీసీ సెంటర్ ప్రారంభించి, కుక్కల నియంత్రకు శస్త్ర చికిత్స ప్రారంభించాలని సూచించారు. ఈయన వెంట జిల్లా పశువైద్యాధికారి సురేశ్, తహసీల్దార్ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మండల పశువైద్యాధికారి విజయ్, డీఈ రమాదేవి, మేనేజర్ క్రాంతి, పీడీ మోతీరాం, తదితరులు పాల్గొన్నారు.



వేడుకల పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అధికారులు

# ఎస్సీఎంలో విచారణకు త్వరలో ఆదేశాలు

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్, ఆగస్టు 23 : సిర్పూర్ పేపర్ మిల్లులోనిపలు సమస్యలపై రాష్ట్ర లేబర్ కమిషనర్ కృష్ణ ఆదిత్య, జాయింట్ కమిషనర్ సునీత త్వరలో విచారణకు ఆదేశాలు జారీ చేయనున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. హైదరాబాద్‌లో శుక్రవారం లేబర్ కమిషనర్, జాయింట్ లేబర్ కమిషనర్‌తో మిల్లులోని పలు సమస్యలపై ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చర్చించారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సొసైటీ డబ్బులో జరిగిన అవినీతి అక్రమాలపై, మిల్లులో గుర్తింపు సంఘం ఎన్నికలు జరుగకపోవడం, ఎన్‌సీఆర్‌టీ ఆర్డర్ అమలు చేయకపోవడం, స్థానికులకు ఉద్యోగాలు కల్పించకపోవడం, మిల్లులో సౌకర్యవంతమైన క్యాంటీన్ లేకపోవడం, కార్మికులు చనిపోతే కుటుంబీకులకు ఉద్యోగాలు కల్పించకపోవడం, స్థానికేతరులకు అధిక జీతాలు చెల్లించి, స్థానికులకు చాలీచాలని జీతాలు చెల్లించడం, తదితర విషయాలపై చర్చించినట్లు చెప్పారు. ఈ మేరకు లేబర్ కమిషనర్, జాయింట్ లేబర్ కమిషనర్ సానుకూలంగా స్పందించారన్నారు. త్వరలో విచారణ జరిపి, కార్మికులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు స్పష్టం చేశారు. ఈయన వెంట బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ లెండుగూరే శ్యాంరావు, కార్మిక సంఘం నాయకుడు ఈర్ల సతీశ్, కార్మికులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, కార్మిక సంఘం నాయకులు

# వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి

బెల్లంపల్లి, ఆగస్టు 23 : వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 28వ వార్డులో డ్రైడే ఫ్రైడే నిర్వహించారు. పారిశుధ్య సిబ్బంది మురుగు కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్ సరిత, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ వైకుంఠం, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ సంతోష్, టీఎంసీ దుర్గయ్య, ఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీసీ నస్పూర్, ఆగస్టు 23 : నస్పూర్ మున్సిపాలిటీలోని 25 వార్డుల్లో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ చిట్యాల సతీశ్ పర్యటించి, ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ సుర్కిళ్ల వేణు, వైస్ చైర్మన్ గెల్లు రజిత మల్లేశ్, మెప్మా టీఎంసీ, ఆర్పీలు, ఏఎన్ఎంలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కోటపల్లి, ఆగస్టు 23 : షట్‌పల్లి, శంకరాపూర్ గ్రామాల్లో డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులకు హెల్త్ అసిస్టెంట్ పబ్బ సుధాకర్ గౌడ్ పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఆశ కార్యకర్త వేముల శంకరమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

మందమర్రి రూరల్, ఆగస్టు 24 : మండలంలోని పొన్నారం, మామిడిగట్టు గ్రామాల్లో డ్రైడే డ్రైడే నిర్వహించారు. దోమల నివారణ చర్యలు చేపట్టి, బైలార్వ మందు పిచికారీ చేయించారు. ఎంపీడీవో రాజేశ్వర్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సునీత, కార్యదర్శి హరీశ్, సంధ్య, హెల్త్ అసిస్టెంట్ గ్లోరీ, ఫీల్డ్ అసిస్టెంట్ జిల్లా అధ్యక్షుడు ఈద లింగయ్య పాల్గొన్నారు.

## పోటీ పరీక్షలపై అవగాహన సదస్సు

అవగాహన కల్పిస్తున్న ప్రసన్నహరికృష్ణ

నస్పూర్, ఆగస్టు 23 : జిల్లా కేంద్రంలోని లైబ్రరీలో శుక్రవారం నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలపై విన్నర్స్ పబ్లికేషన్ రచయిత ప్రసన్నహరికృష్ణ అవగాహన కల్పించారు. ప్రిపరేషన్ విధానం, ఏయే పుస్తకాలు చదవాలి, ఎంత సమయం చదవాలి తదితర విషయాలపై వివరించారు. అనంతరం అభ్యర్థులకు ఆన్‌లైన్ కోర్సు పుస్తకాలను ఉచితంగా అందించారు. ఫ్యాకల్టీలు అంబాల రాజ్‌కుమార్, విహార్ వర్మ, నాగరాజు, శ్రీను, రాజేశ్, జీవన్, లైబ్రరీ ఇన్‌చార్జి కృతిన్, అభ్యర్థులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు వీడ్కోలు సన్మానం

జన్నారం, ఆగస్టు 23 : బదిలీపై వెళ్తున్న ఎంపీవో సిగిడి రమేశ్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్‌రావు, జేఈ సతీశ్, కార్యదర్శులు, ఆఫీస్ సబార్డినేటర్లను ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో శశికళ, తహసీల్దార్ రాజమనోహరెడ్డి, కార్యదర్శుల సంఘం మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్ సన్మానించారు. ఎంపీఎం రవీందర్, విలాస్, కార్యదర్శులు రాహుల్, మనుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## జన్నారంలో విద్యార్థుల ర్యాలీ

జన్నారం, ఆగస్టు 23 : కోల్‌కత్తాలో శిక్షణ డాక్టర్ హత్యను నిరసిస్తూ మండల కేంద్రంలోని రాఘవేంద్ర, కరిమల కళాశాలల విద్యార్థులు ప్రధాన రహదారిపై ర్యాలీ తీశారు. స్థానిక తెలంగాణ తల్లి చౌరస్తా వరకు ర్యాలీ సాగింది. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కరస్పాండెంట్ ఎర్ర సంపత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వేతనాలు చెల్లించాలి

సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

లక్షెట్టిపేట, ఆగస్టు 23 : లక్షెట్టిపేట ప్రభుత్వ దవాఖానలో ఔట్‌సోర్సింగ్ విభాగంలో పని చేస్తున్న ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని కోరుతూ సూపరింటెండెంట్ ఆకుల శ్రీనివాస్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. రెండేళ్ల నుంచి శివ బాలాజీ ఏజన్సీ ద్వారా ఎంపికై, విధులు నిర్వహిస్తున్నామని, 8 నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషన భారమవుతున్నదన్నారు. ప్రభుత్వం స్పందించి, వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు శానిటేషన్ సూపర్‌వైజర్ విక్రమ్‌తో పాటు ఘట్టయ్య జాకీర్, సతీశ్, మాదవి, స్వరూప, రమ, నిఖిల్‌కుమార్, భాగ్యలక్ష్మి, లక్ష్మి, జ్యోతి, హజీమ, హసీన, శ్రావన్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిజియోథెరపీపై అవగాహన

తాండూర్, ఆగస్టు 23 : మండలంలోని తంగళ్లపల్లి హైస్కూల్‌లో శుక్రవారం మండల స్థాయిలో ఉపాధ్యాయులకు నిజాం ఇన్‌స్టిట్యూట్ ఫిజియోథెరపిస్టులు మహేశ్, వెంకటరమణ ఫిజియోథెరపీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ మాట్లాడుతూ.. ఫిజియోథెరపీపై అవగాహన పెంపొందించుకొని ఉపాధ్యాయులు ఆరోగ్యాన్ని, వొప్పులను తగ్గించుకోవాలని సూచించారు. మండల నోడల్ అధికారి మల్లేశం, తాండూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రెగ్యులర్ చేయాలి

మాట్లాడుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 23 : సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఆ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం పాత్ర కమిటీని తిరిగి కొనసాగించాలని ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పవార్ తుకారం, కోశాధికారి బోయిని నగేశ్, అధికార ప్రతినిధి పవన్, మీడియా ప్రతినిధి గేడేకార్ సంతోష్, కార్యదర్శి దుర్గం సందీప్, వెంకటరమణ, నాయకులు మహేశ్, మిట్ట దేవేందర్, సత్యనారాయణ, రమేశ్, రాజేశ్, రాజ్‌కుమార్, చిట్ల తిరుపతి, ఆనంద్, శృతిక, స్వప్న పాల్గొన్నారు.

## గిరిజనులకు వసతులు కల్పించాలి

జన్నారం, అగస్టు 23 : గిరిజనులకు అన్నిరకాల మౌలిక వసతులు కల్పించాలని ఎంపీడీవో శశికళ తెలిపారు. మండలంలోని కొత్తపేటలో నిర్వహించిన పీఎం జన్‌మన్ కార్యక్రమం నిర్వహించారు. ఆర్థిక అక్షరాస్యత సాధించడంతో పాటు, అన్ని కాలనీలను ఎప్పటికపుడు శుభ్రంగా ఉండేలా చూడడంతోపాటు, అనారోగ్యంగా ఉన్నవారికి పరీక్షలు చేసి మందులు అందించాలన్నారు. తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయాలి

సిర్పూర్(టీ), ఆగస్టు 23 : ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ డీఏలను విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతి కుమారి డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ పాఠశాలలను శుక్రవారం సందర్శించి, ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు చేపట్టారు. పీఆర్సీ అమలుకు జాప్యం లేకుండా ప్రభుత్వం ముందుకు రావాలని, 5,571 పీఎస్ హెచ్ఎం పోస్టులను మంజూరు చేయాలని, ఎస్ఎస్ఏ, కేజీబీవి ఆశ్రమ, గురుకులాల్లో సీఆర్టీ, గెస్ట్‌పార్ట్ టైం, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ 12 నెలల వేతనం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. టీఎస్ యూటీఎఫ్ మండలాధ్యక్షుడు హరీశ్, మండల బాధ్యులు సాయికుమార్, పద్మజ, బాజిఖాన్ పాల్గొన్నారు.

## రైతులకు శిక్షణ కార్యక్రమం

తాండూర్, ఆగస్టు 23 : మండలంలోని రైతులకు శాస్త్రవేత్తలు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించి, అవగాహన కల్పించారు. బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం, మంచిర్యాల జిల్లా శాస్త్రవేత్తలు మండలంలోని కొత్తపల్లి రైతు వేదికలో గిరిజన ఉప ప్రణాళిక-2024 కింద గిరిజన రైతులకు సమగ్ర పంట యాజమాన్య పద్ధతులతో వంకాయ సాగు విధానాల గురించి రైతులతో చర్చించారు. తరువాత వివిధ కూరగాయ పంటల్లో రైతులకు శాస్త్రీయ సలహాలను వివరించారు. డాక్టర్ యూ ప్రవంతి, ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, తాండూర్ మండల ఇన్‌చార్జి వ్యవసాయ ధికారి ప్రేమ్‌కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు యూ శంకర్, పుష్పలత, 35 మంది రైతులు పాల్గొన్నారు.

## బాధ్యతల స్వీకరణ

బెల్లంపల్లి, ఆగస్టు 23 : బెల్లంపల్లి తహసీల్దార్‌గా జ్యోత్స్న శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ అధికారిగా పని చేస్తున్న ఆమె ఇక్కడికి బదిలీపై రాగా, ఇక్కడ పనిచేసిన ప్రసాద్.. కలెక్టరేట్ సీ సెక్షన్ సూపరింటెండెంట్‌గా వెళ్లారు. సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## కోర్టు ఆవరణలో వన మహోత్సవం

ఆసిఫాబాద్ కోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న జిల్లా జడ్జి రమేశ్, సీనియర్, జూనియర్ సివిల్ జడ్జీలు

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 23 : వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో శుక్రవారం జడ్జి రమేశ్, సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్, జూనియర్ సివిల్ జడ్జి అనంత లక్ష్మి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్, సీనియర్ న్యాయవాదులు ఎం సురేశ్, టీ సురేశ్, చందర్ కుమార్, సతీశ్ బాబు, రాజీవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా మెర్జింగ్ స్టేట్‌మెంట్ పరిశీలన



ఓటరు లిస్ట్ పరిశీలిస్తున్న ఎంపీవో షేక్ సఫ్దర్ అలీ

కాసిపేట, ఆగస్టు 23 : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా కాసిపేట జీపీ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీల వారీగా ఓటర్ల జాబితా మెర్జింగ్ స్టేట్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటర్ల జాబితా మెర్జింగ్ స్టేట్‌మెంట్ అనుసరించి, టీ పోల్ వెబ్‌సైట్‌లో వార్డుల వారీగా నమోదు కార్యక్రమాన్ని డీఎల్‌పీవో, మండల పంచాయతీ అధికారి షేక్ సఫ్దర్ అలీ పరిశీలించారు. సీనియర్ సహాయకులు ఆకుల లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్ రాజేందర్ పాల్గొన్నారు.

## గూడెంలో నేటి నుంచి పవిత్రోత్సవాలు

దండేపల్లి, ఆగస్టు 23 : గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం నుంచి మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో సంకటాల శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. దేవాలయ పవిత్రత, భక్తుల శ్రేయస్సు కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం నుంచి వేదపండితులు, అర్చకులతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

## ఎస్సీ వర్గీకరణకు సహకరించాలి

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 23 : ఎస్సీ వర్గీకరణకు సహకరించి, ఎస్సీల అభ్యున్నతికి తోడ్పాటు అందించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు మాలలు కూడా సహకరించాలని కోరారు. నాయకులు పోశం, కొర్ల ప్రభాకర్ కూటికల పోశం, సంతోష్, కరుణాకర్, రాము, రాజేశ్ పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

చింతల